కొనుగోళ్లకు పడిగాపులు

- కేంద్రాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం రాశులు
- ప్రారంభం కాని తూకం


వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

గంగాధర: ఆరుగాలం శ్రమించి, కష్ట నష్టాలకు ఓర్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వారం రోజుల క్రితం నుంచి మండలంలో వరి కోతలు మొదలయ్యాయి. కోసిన ధాన్యాన్ని పోసుకోవడానికి పొలాల వద్ద కల్లాలు లేక ఇండ్ల వద్ద స్థలం దొరక్క గతంలో ధాన్యం కొనుగోలు చేసిన కేంద్రాల వద్ద, ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ చదును చేసుకొని ధాన్యం ఆరబోస్తున్నారు. ఏప్రిల్‌లో కురిసే అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రోజురోజుకు వరి కోతలు పెరిగే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి తూకం మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని కురిక్యాల గ్రామంలో రెండు రోజుల క్రితం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించినా తూకం మొదలు కాలేదు.

33 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు

మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో వానాకాలం, యాసంగిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. గంగాధర, కురిక్యాల సహకార సంఘాల ఆధ్వర్యంలో, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రాలను నిర్వహిస్తారు. యాసంగి కేంద్రాలను వెంటనే ప్రారింభించాలని రైతులు ఎదురు చూస్తుంటే మండలంలో కొనుగోళ్లకు ఎటువంటి ఏర్పాట్లు ప్రారంభించలేదు.

తగ్గిన సాగు విస్తీర్ణం

మెట్ట ప్రాంతం గంగాధర మండలంలో నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు వరద కాలువ ద్వారా చెరువులు, కుంటలు నిండటం భూగర్భ జలాలు పెరగడంతో నాలుగైదేళ్లుగా మండలంలో వరిసాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. గతంలో రబీలో మూడు, నాలుగు వేల ఎకరాలు దాటని వరిసాగు ప్రస్తుతం ఐదింతలు పెరిగింది. వరద కాలువ ఎగువ ప్రాంత గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోయి సాగు విస్తీర్ణం తగ్గింది. రబీ సీజన్‌లో 20 వేల ఎకరాలకు మించి రైతులు వరి సాగు చేస్తారు. ప్రస్తుత రబీలో 19 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సాగునీటి సమస్యతో కొన్ని పొలాలు ఎండి పోగా తెగుల్లు సోకి సైతం కొంతమేరకు పంటపొలాలు దెబ్బతిన్నాయి.

కొనుగోలు కేంద్రాలకే మొగ్గు

మద్దతు ధర పెంచినప్పటికి గతంలో ప్రయివేటు వ్యాపారులకు అమ్మకానికి మొగ్గు చూపిన రైతులు ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవడానికి ఎదురు చూస్తున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే క్వింటాలుకు మూడు నుంచి మూడు వందల యాభై వరకు ఖర్చయిందని, తూకంలో కోతలు విధించారని, ధాన్యం డబ్బులకు నెలల తరబడి పడిగాపులుకాశారు అందుకే కొందరు రైతులు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవడానికి మొగ్గు చూపారు. వర్షాకాలంలో చాలా మంది రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. ప్రస్తుతం తూకంలో కోతలు ఉండవనే ధీమాతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించడానికి మొగ్గుచూపుతున్నారు. కేంద్రాల్లో ధాన్యం పోయడానికి స్థలం లేదని, కేంద్రాలు ప్రారంభం కాలేదని, అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందనే భయంతో మిల్లర్లకు, ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

వంకలు పెట్టొద్దు



ధాన్యం కేంద్రాల వద్ద పోశాను. తూకం కోసం పడిగాపులు కాస్తున్నాం. కేంద్రాలు ప్రారంభించిన తరువాత తాలు, తడి, అంటూ మరిన్ని రోజులు జాప్యం చేస్తారు. కేంద్రాలు ప్రారంభించి వంకలు పెట్టకుండా ధాన్యం సేకరించాలి.

బొల్లాడి మధుకర్‌రెడ్డి, రైతు, ఉప్పరమల్యాల

త్వరలోనే కొనుగోళ్లు



మండలంలోని గ్రామ పంచాయతీల్లో కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. కేంద్రాలు ప్రారంభంపై ఆదేశాలు రాలేదు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాగానే ప్రారంభిస్తాం.

రాచకొండ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి


సత్యాగ్రహదీక్షలో నాయకులు

శంకరపట్నం: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని మండలంలోని కేశవపట్నంలో ఆదివారం బీసీ ఆజాదీ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బొంగోని అభిలాశ్, నాయకులు సత్యగ్రహదీక్ష చేపట్టారు. దీక్షకు మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ రహీం, సీనియర్ రిపోర్టర్ కొరిమి వెంకటస్వామి మద్దతు తెలిపారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. సాయంత్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య నిమ్మరసం ఇచ్చి సత్యగ్రహ దీక్షను విరమింపచేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, వరంగల్ జిల్లా ఇంచార్జి మనోహర్, తిరుపతి, రాజు, సతీష్, రవీంద్రాచారి, శంకర్, భద్రయ్య, రవి, ప్రవీణ్, సుదీర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద జమ్మికుంట నిత్య యోగా సాధన సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేద్రం ప్రారంభించారు. పట్టణానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యోగా గురూజీ, నిత్య యోగా సాధకులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన


ఆలయ ఆవరణలోని యాగశాల

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి పూజలు చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన నెమలి రామారావు దంపతులు గుమ్లాపూర్‌లో ఆలయం నిర్మించేందుకు అంకురార్పన చేశారు. ఆయన కూతురు అల్లుడు సామనపల్లి శ్రీలత,కృష్ణమాచారి దంపతులు ఆలయాన్ని భక్తుల విరాళాల సాయంతో పూర్తి చేయించారు. శిరిసనహల్ కుటుంబ సభ్యులు ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు. దాతల సాయంతో ప్రతిరోజు అన్నదాన కార్యక్రం నిర్వహిస్తున్నారు. సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతకు ప్రశంసా పత్రం అందిస్తున్న బాధ్యులు

హుజూరాబాద్: మండలంలోని కందుగుల గ్రామంలో ఆదివారం సచిన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా సీఐ తిరుమల్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమవుతుందని, ఇలాంటి శిబిరాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. అనంతరం రక్తదాన శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి అసోసియేషన్ బాధ్యులు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అన్నారపు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరీష్, ఉపాధ్యక్షుడు మంద శ్రీనివాస్, లక్కెపల్లి ప్రదీప్, సభ్యులు తదితరులున్నారు.

అంబేడ్కర్ విగ్రహం శుద్ధి

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేటలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుర్పాటి రాజు ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. విగ్రహం చుట్టూ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల సదయ్య, మొలుగురి రాజు, కొలిపాక వెంకటేష్, పోతుల సంజీవ్, అపరాధ రమణ, మోలుగురి నగేష్, క్యాస వెంకటేష్, కొడిమ్యాల పవన్ తదితరులున్నారు.


గంగాధర: రథోత్సవంలో గ్రామస్తులు


గన్నేరువరంలో..

ఘనంగా రథోత్సవం

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో ఆదివారం సీతారామచంద్రస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల పూజల అనంతరం రథాన్ని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. రథోత్సవంలో మాజీ సర్పంచు కంకణాల విజయేందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి, రోమాల రమేశ్, గంగాధర కనకయ్య, కంకణాల మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజేశంగౌడ్ గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రథోత్సవాన్ని గ్రామాల్లో విధులు గుండా ఊరేగించగా భక్తులు కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని భక్తులు తాడుతో గ్రామ వీధులు లాగారు.



శంకరపట్నం: రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో నాయకులు, గన్నేరువరం: మైలారంలో...

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

గన్నేరువరం: మండలంలోని మైలారం, సాంబయ్యపల్లె గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు. గ్రామశాఖ అధ్యక్షులు, ఎస్సీ, బీసీ, మహిళ, యూత్ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్లను తుడిచివేసే విధంగా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధక్షుడు బస్వయ్య, పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు, కవ్వ పద్మ, తిరుపతి, మల్లారెడ్డి, శ్రీనివాస్, పద్మ, షారుఖ్, పాపిరెడ్డి, రాజరెడ్డి, రాజయ్య, సంపత్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నాయని, రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో ఆరబోసి రోజుల గడుస్తున్నాయని, అధికారులు కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. వర్షాలు పడే అవకాశం ఉందని, పరదాలు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని రైతులు దళారులకు అమ్ముకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు చేయాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

వీణవంక: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ మవురపు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్బాక, గంగారం గ్రామాలలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను చైర్మన్‌తో పాటు డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ధాన్యం కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, దళారులకు ధాన్యం అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గెల్లు మల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, సీఈవో ప్రకాశ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో కైనెటిక్ గ్రీన్ ఈ వెహికిల్స్


షోరూంను ప్రారంభిస్తున్న సీఈవో సంజయ్

తిమ్మాపూర్: సామాన్యులు, చిరువ్యాపారులకు అందుబాటులో ఉండేలా కైనెటిక్ గ్రీన్ కంపెనీ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చిందని కంపెనీ సీఈఓ సంజయ్ బజాజ్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూర్‌లో షోరూంను ఆదివారం ప్రారంభించారు. రైతులకు గ్రామాల్లో తిరిగే చిరు వ్యాపారులకు అందుబాటులో ఉండేలా తక్కువ ధరకు ఎక్కువ కిలోమీటర్లు వెళ్లేలా తమ కైనెటిక్స్ లూనాలు, స్కూటీలు మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. కంపెనీ ప్రతినిధులు రామ్ బజాజ్, రాహుల్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోస్టుమెన్, ఎంటీఎస్ డివిజన్ కార్యదర్శిగా మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన ఓరుగంటి విష్ణువర్ధన్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన పోస్టల్ ఉద్యోగుల సమావేశంలో విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ ప్రకటించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. యూనియన్ వేదికగా పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అంబేడ్కర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పవన్


నూతన కమిటీ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ అంబేడ్కర్ గ్రామకమిటీ అధ్యక్షుడిగా దాసారపు పవన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామకమిటీ ఎన్నిక నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా మొలుగూరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా కాలేశి కరుణాకర్, కోరపల్లి శివప్రసాద్, కాసర్ల ప్రభాస్, కోశాధికారిగా కనకం సాయికుమార్, జాయింట్ కోశాధికారిగా గాజుల సుదర్శన్, ముఖ్య సలహాదారుడిగా మోరె శ్రీనివాస్, ఆకునూరి మహేందర్, గౌరవ సలహాదారులుగా మోరె సతీష్, గణేశ్, దాసారపు నరేందర్,గాజుల రమేశ్,మోరె పోచయ్యను ఎన్నుకున్నామని తెలిపారు.

సన్మానం

హుజూరాబాద్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 42వ బూత్‌లో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయినా వంగ మనోహర్‌రెడ్డి, కళ్లెపు సుధాకర్‌రావు, కొమరవెల్లి సదానందం, మెరుగు రాజిరెడ్డిని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, నాయకులు పైళ్ల వెంకటరెడ్డి, సబ్బని రమేశ్, మాధవి, గంగిశెట్టి ప్రభాకర్, కళ్లెపు రేణుక, నరాల రాజశేఖర్, తిప్ప బత్తిని రాజు తదితరులున్నారు.

కేంద్ర మంత్రికి భద్రాచలం తలంబ్రాలు అందజేత

కరీంనగర్‌రూరల్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం రిటైర్డ్ ఏఏస్పీ ఆర్.సాయిబాబా, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ సమిండ్ల శ్రీనివాస్‌రావు కలిసి భద్రాచలం లడ్డూ ప్రసాదం, శ్రీరాముల కల్యాణోత్సవం తలంబ్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నం ప్రకాశ్, మంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం మరువలేనిది

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం మరువలేనిదని ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి అన్నారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఆలయ ట్రస్టు కమిటీ సమావేశం నిర్వహించారు. గతేడాదిగా వార్షిక ఆదాయ వ్యయాలను పరిశీలించి ఆమోదించారు. ఆలయంలో ప్రతి గురువారం నిర్వహించే కార్యక్రమాలతో పాటు పౌర్ణమి వేడుకలను భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డోలి రాజయ్య, దూస రాము, కొల్లూరి ఆనందం, తాటిపెల్లి అంజయ్య, కొత్తపల్లి లక్ష్మణ్ బాబు, గుర్రం చంద్రారెడ్డి, ఇప్పనపల్లి సాంబయ్య, నలుమాచు రామకృష్ణ, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, దండె రాజయ్య, బోయిని నర్సింగరావు, సిరిపురం ఆనందం, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మండలంలోని బూజునూర్, వంతడ్పుల గ్రామాల పరిధిలోని డీబీఎం–16 ఎస్సారెస్పీ ఉప కాల్వ సిమెంట్ లైనింగ్ దెబ్బతినడంతో రైతులే సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతులు చేసుకొని పంటలు కాపాడుకున్నారు. నీటి వినియోగ సంఘాలు రద్దు కావడంతో కాలువల నిర్వహణ అటకెక్కి చివరి భూములకు నీరందడం లేదు. ఏటా చివరి భూముల రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డ్రాపు మరమ్మతు కోసం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమేశ్, ఎస్సారెస్పీ ఏఈ, సెల్ నంబర్ : 74166 64166

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీణవంక: మండలంలోని చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995–96 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు మదన్‌మోహన్‌రావు, రాజిరెడ్డి, రామ్‌కుమార్, సుధాకర్, కాశి విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

దేశ భద్రత, అభివృద్ధికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు తెలియజేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం గణనీయమైన కృషి చేస్తోదని, బీజేపీ ఆవిర్భావం నుంచి కార్యకర్త త్యాగం, శ్రమ, సేవాభావంతో ప్రజల విశ్వాసం గెలుచుకుందన్నారు. దేశంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశ భద్రత, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉడుగుల మహేందర్, పొనగంటి రవికుమార్, బొజ్జ శరత్, అకుల పోచయ్య, చిరియాల విజయ్, విలాసాగర్ శ్రీధర్, పంచగిరి అఖిల్, బాషవేన రాము, సాయిని వెంకటేశం, అకుల ప్రభాకర్, తోట రాజయ్య, పొనగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామరక్షణ దళాల ఏర్పాటు



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్: దొంగతనాలను అరికట్టడానికి గ్రామ రక్షణ దళాలను ఏర్పాటు చేస్తున్నామని మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మనఊరు మనసంరక్షణ పేరిట సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకూ మండలంలోని అన్నారం గ్రామంలో యువకులకు గ్రామ రక్షణ దళాలపై అవగాహన కల్పించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు దొంగతనాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందని, 18 ఏళ్లు నిండినవారు గ్రామ రక్షణ దళాలుగా మారాలని సూచించారు. ప్రతిరోజు ముగ్గురు లేదా నలుగురు గ్రామంలో రాత్రి పూట తిరగాలని సూచించారు. ఐడీ కార్డులతో పాటు టార్చిలైట్లు, లాఠీలు ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్, ఉచిత క్యాంపులు నిర్వహించినప్పుడు జాబ్స్ ఇప్పిస్తామన్నారు. మన ఊరికి మనమే పోలీస్ ఆఫీసర్ కావాలని సూచించారు. రాత్రివేళ పెట్రోలింగ్ పోలీసులు కలుస్తారని, గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

కోతులు, కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలో కోతులు, కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కొత్తగట్టులో ఆదివారం రాకేశ్(6)స్నేహితులతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా కోతులు గుంపుగా వచ్చి రాకేశ్‌ను గాయపరిచాయి. తాడికల్ గ్రామంలో గడ్డి పర్శరాములు ఇంటిలోకి కోతులు రావడంతో బయటకు పంపేందుకు ప్రయత్నించగా కోతులు మీద పడి గాయపర్చాయి. మరో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కుక్కలు దాడి చేయడంతో కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

శ్రీపాదరావుకు నివాళి



హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు కిరణ్‌కుమార్, తిరుపతి, రాధ, శంకర్, వినోద్ రెడ్డి, రాజు, ఇమ్రాన్, అఫ్సర్, గోపాల్‌రావు, కుమార స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.